తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
హైదరాబాద్ - రంగారెడ్డి
మేడ్చల్ మల్కాజిగిరి వికారాబాద్
సోమవారం
11 మే 2026
పేజీలు : 08





- సుమారు రూ.40 కోట్ల భూమి కబ్జాదారుల చేతుల్లోనే..
- అధికారుల సమన్వయ లోపంతో మితిమీరిన ఆగడాలు
- ఎన్నోసార్లు ఫిర్యాదు చేసినా ఎవరికి పట్టడం లేదు
- స్థానిక రాజకీయ నాయకుల ఒత్తిడితో యంత్రాంగం వెనుకడుగు


# పెద్దచెరువును గద్దల్లా తన్నుకు పోతుండ్రు

## పీర్జాదిగూడలోని సర్వే నెం. 75లో వేలాది గజాలు హాంఫట్

**ఆ చెరువు విస్తీర్ణం దాదాపు 34.11 ఎకరాలు.. అదిప్పుడు మెల్లిమెల్లిగా రాజకీయ నాయకుల కబ్జా చెరలో బందీ అవుతున్నది. కొందరు స్థానికులు ఫిర్యాదుచేస్తే పరిశీలనకు వెళ్లిన ఇరిగేషన్ ఏఈ తిరిగి వెనక్కి వచ్చాడు. ఆ ఫిర్యాదు బుట్టదాఖలైంది. ఆ చెరువు బఫర్ జోన్, ఎఫ్‌టీఎల్ పరిధిలోని నిర్మాణాలు జరుగుతున్నా పట్టించుకోవడం లేదు. అధికార పార్టీ నేత కనుసన్నల్లోనే ఈ తంతంగమంతా జరుగుతుండటం విశేషం. ఇక్కడ గమనించాల్సిన ప్రధాన విషయం ఏమిటంటే.. బిఆర్ఎస్ హయాంలో మొదలైన అక్రమాల బాగోతం.. కాంగ్రెస్ సర్కారులోనూ అదే నాయకుడు కొనసాగిస్తుండడం గమనార్హం.**

**బోడుప్పల్, మే 10 (జనంసాక్షి) :**

బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని పీర్జాదిగూడ పెద్ద చెరువు ఎఫ్ టిఎల్, బఫర్ జోన్ పరిధిలో ఉంది. అయినప్పటికీ దాదాపు 40 కోట్ల విలువైన భూమి క్రమక్రమంగా భూమి కబ్జాకు గురైంది. ఈ ఏడాది కాలంలోని 2 వేల గజాల భూమి కబ్జాల పాలైంది. ఈ మూడు నాలుగేండ్ల కాలంలోనే 3 ఎకరాల వరకు కబ్జాకోరల్లో చిక్కుకుంది. రెవెన్యూ, ఇరిగేషన్ శాఖ అధికారులకు ఫిర్యాదులు చేసినప్పుడు మాత్రమే కూలగొడుతున్నారు. అనంతరం మళ్లీ నిర్మాణాలు చేపడుతున్నారు. హైడ్రాకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదు. వారు పట్టించుకోవడం లేదు. నాడు బిఆర్ఎస్ నేతగా ఉన్న నాయకుడే ప్రస్తుతం కాంగ్రెస్ లోకి మరి ఈ కబ్జాలకు తెరలెపినట్లు తెలుస్తోంది. 35 ఎకరాల పరిధిలోని పెద్ద చెరువు భూమిలో బఫర్‌జోన్, ఎఫ్‌టీఎల్ హద్దులు నిర్ణయించారు. అందులో ఎటువంటి నిర్మాణాలు చేపట్టడానికి వీలుండదు. కానీ మూడేండ్ల కాలంలో హద్దులు చెరిపివేసి దాదాపు 3ఎకరాల్లో కబ్జా చేసి నిర్మాణాలు చేపడుతున్నారు. అధికారులు అవినీతిపరులయ్యారని, డబ్బులు తీసుకుని కబ్జాలను ప్రోత్సహిస్తున్నారన్న ఆరోపణల నేపథ్యంలో ఎట్టకేలకు మొన్నటి శుక్రవారం అధికారులు పరిశీలించి ఆరు ఇండ్లు హద్దులు దాటి ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మాణాలు చేపట్టినట్టు గుర్తించారు. ఈ అక్రమాల పర్వం నాలుగేండ్లుగా కొనసాగుతూ 3 ఎకరాల వరకు కబ్జాకు గురైనట్టు తెలుస్తోంది. ఈ భూమి విలువ దాదాపు 30 కోట్ల వరకు ఉంటుందని అంచనా.




### రాత్రి వేళల్లో గుట్టుగా పనులు

ఫీర్జాదిగూడ కార్పొరేషన్‌కు చెందిన ఓ స్థానిక నాయకుడు అధికారుల చేతులు తడుపుతూ ఈ కబ్జాల పర్వం కొనసాగింది. అతను మరికొందరు వ్యక్తులతో కలిసి శిఖం భూమిలో మట్టిని, నిర్మాణ వ్యర్థాలను తీసుకొచ్చి కుప్పలుగా పోస్తున్నారు. రాత్రి వేళల్లో ఆ మట్టిని చదును చేయిస్తున్నారు. అనంతరం నిర్మాణాలు చేపడుతున్నారు. ఈ విషయాన్ని ఇప్పటికే స్థానికులు అనేకమార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయింది. ఇలా మెల్లిమెల్లిగా చెరువు ఆనవాళ్లు లేకుండా చేస్తున్నారు. ఇప్పటికైనా హైడ్రా అధికారులు స్పందించకుంటే ఒకప్పుడు ఇక్కడ పెద్దచెరువు ఉండేదని చరిత్ర పుటల్లో చదువుకోవడం తప్ప చేసేదేమీ ఉండదు. పెద్ద చెరువు గ్రామ నక్షా ప్రకారం విస్తీర్ణం సుమారు 34.11ఎకరాలుగా ఉంది. అయితే ఈ విస్తీర్ణంలో ఇప్పటికే సగభాగం మేర కబ్జాల పాలదయ్యిందని స్థానికుల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తాయి.

### నాడు నిధులు.. నేడు ఆక్రమణలు

ఈ చెరువు సుందరీకరణ కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో హెచ్ఎండీఏ రూ.15 కోట్ల వరకు నిధులు వెచ్చించారు. పరిసరాలను ఆహ్లాదకరంగా మార్చి సుందరంగా తీర్చదిద్దారు. పటిష్టమైన రిటర్నింగ్ వాల్ ఏర్పాటు చేసి మినీ ట్యాంక్ బండ్ శోభను తలపించింది. పెద్దఎత్తున నిధులతో చెరువు సుందరీకరణను స్థానికులు స్వాగతిస్తూనే చెరువు వెనుక వైపు శంకర్‌నగర్ కేంద్రంగా కబ్జాలు చేస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చెరువు ఎఫ్‌టీఎల్ హద్దులు నిర్ధారించినా వాటిని ఖాతరు చేయకుండా చెరువులో సైతం మట్టి పోసి కప్పివేయడం ఆ తరువాత ఇండ్ల నిర్మాణాలు చేపట్టారు. శంకర్ నగర్ పెద్ద చెరువుపై వెంటనే పూర్తి స్థాయి సర్వే నిర్వహించి, అక్రమ నిర్మాణాలను తొలగించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అలాగే ఈ వ్యవహారంలో అధికారులను వెనక్కి రప్పించిన రాజకీయ ఒత్తిళ్లపై కూడా ఉన్నతస్థాయి విచారణ జరపాలని ప్రజలు కోరుతున్నారు.





# రుక్మాపూర్‌లో భారీ కుట్ర భగ్నం




**వికారాబాద్ జిల్లా బ్యూరో మే 10 (జనం సాక్షి):** దేశంలో ఎక్కడ సంఘటన జరిగిన జిల్లాకు లింక్ ఉంటుంది. గతంలో ఒక ఉగ్రవాది అరెస్టు తర్వాత అక్కడక్కడ జరిగిన సంఘటనల వెనక జిల్లాకు లింకు ఉంటుందని దర్యాప్తు సంస్థలు ధ్రువీకరించాయి. ఇటీవల నగరంలో ఉగ్రవాదుల అరెస్ట్ ఇప్పుడు మావోయిస్టుల అరెస్టు వెనక జిల్లాకు లింకులు ఉన్నాయి. ఉగ్రవాదులకు మావోయిస్టులకు ఈ ప్రాంతం సేఫ్ జోన్ గా మారబోతుందానే సందేహం జిల్లా వాసులకు కలుగుతుంది. ప్రశాంతమైన వాతావరణంతో పాటు దట్టమైన రిజర్వ్ ఫారెస్ట్ కొండలు గుట్టలు కలిగిన ఈ ప్రాంతంలో పోలీస్ నిఘా తక్కువగా ఉంటుందని భావించిన ఉగ్రవాదులు మావోయిస్టులు ఈ ప్రాంతాన్ని సేఫ్ జోన్ గా ఎంచుకొని కార్యక్రమాలు నిర్వహిస్తున్నారా అనే సందేహాలు కలగక మానదు. వివరాల్లోకి వెళితే వికారాబాద్ జిల్లా పెద్దేముల్ మండలం రుక్మాపూర్ రైల్వే స్టేషన్ లో నలుగురు మావోయిస్టులు అరెస్టయ్యారు. ఈ సంఘటన జిల్లాలో తీవ్ర కలకలం సృష్టించింది. ఆదివారం తెల్లవారుజామున మహారాష్ట్ర, తెలంగాణ రాష్ట్రం తాండూరు పోలీసుల ఉమ్మడి ఆపరేషన్ నిర్వహించారు. వారి ఆపరేషన్ లో రుక్మాపూర్ రైల్వే స్టేషన్ పనిలో కూలీలుగా చేరిన నలుగురు మావోయిస్టు లు అరెస్టు అయ్యారు. విచారణ నిమిత్తం మావోయిస్టులను పోలీసులు మహారాష్ట్రకు తరలించారు. రుక్మాపూర్ రైల్వే స్టేషన్ లో మావోయిస్టులను ఉన్నారని పక్క సమాచారంతో ఆదివారం తెల్లవారుజామున తెలంగాణ మహారాష్ట్ర పోలీసులు సంయుక్తంగా రైల్వేస్టేషన్ ను చుట్టి ముట్టారు. గత కొంతకాలంగా పోలీసుల కళ్లుగప్పి తప్పించుకు తిరుగుతున్న నలుగురు మావోయిస్టులను పోలీసులు చాకచక్యంగా అదుపులోకి తీసుకున్నారు. ఈ సంఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.ప్రాథమిక సమాచారం మేరకు.. మహారాష్ట్ర ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు చెందిన ముగ్గురు పురుషులతో పాటు ఒక మహిళా మావోయిస్టుల పై అక్కడ పలు తీవ్రమైన కేసులు నమోదై ఉన్నాయి. పోలీసుల నిఘా నుంచి తప్పించుకునేందుకు వీరు పక్కా స్కెచ్‌తో రుక్మాపూర్ చేరుకున్నారు. తాండూరు రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలోని రుక్మాపూర్ రైల్వే స్టేషన్‌లో కూలీ పనులకు కుదిరారు. గత పది రోజులుగా ఎవరికీ అనుమానం రాకుండా పనులు చేసుకుంటూ ఇక్కడే తలదాచుకుంటున్నారు.నిందితులు ఇక్కడే ఉన్నారన్న పక్కా సమాచారంతో మహారాష్ట్ర పోలీసులు రంగంలోకి దిగారు. స్థానిక తాండూరు పోలీసుల సమన్వయంతో ఆదివారం తెల్లవారుజామున రుక్మాపూర్ రైల్వే హెడ్ క్వార్టర్స్‌లో మెరుపు దాడులు (రైడ్స్) నిర్వహించారు. నిందితులు తేరుకునే లోపే పోలీసులు వారిని చుట్టుముట్టి అదుపులోకి తీసుకున్నారు.అదుపులోకి తీసుకున్న నలుగురిని ప్రాథమిక విచారణ అనంతరం తదుపరి చర్యల కోసం మహారాష్ట్రకు తరలించారు. వీరి వెనుక ఇంకా ఎవరైనా ఉన్నారా? తాండూరు ప్రాంతంలో వీరికి ఎవరైనా ఆశ్రయం కల్పించారా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. పోలీసులు దాడులు నిర్వహిస్తే సులువుగా తప్పించుకునే అవకాశం ఉంటుందని భావించి ఇక్కడ కూలీలుగా చేరి ఉండవచ్చునని భావిస్తున్నారు. దేశంలో కొన్ని రాష్ట్రాల్లో ఎదురుకాల్పులు ఎన్కౌంటర్లు. తెలంగాణ రాష్ట్రంలో మావోయిస్టుల లొంగుబాట్లు జరుగుతుండగా వికారాబాద్ జిల్లాలో మావోయిస్టులు అరెస్టు కావడం కలవరపెడుతుంది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మావోయిస్టులను లొంగదీసుకోవడానికి అనేక కార్యాచరణ కార్యక్రమాలు చేపట్టింది. అడవుల్లో పట్టణాలలో పోలీసుల తనిఖీలు ముమ్మరమై అడుగడుగునా జల్లెడ పడుతున్నారు. వారి నిఘా నుంచి తప్పించుకోవడానికి మావోయిస్టులు జిల్లాకు వచ్చారా లేక కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు విస్తురపోయే సంఘటనకు పాల్పడి తమ ఉనికి చాటుకోవడానికి ఏమైనా స్కెచ్ వేయడానికి వచ్చారా అనుమానం ప్రజల్లో రేకెత్తిస్తుంది. ఏది ఏమైనా ఈ సంఘటన తీవ్ర సంచలనం సృష్టించింది. ఈ సంఘటనతో రైల్వే పనుల వద్దకు వచ్చే కొత్త వ్యక్తుల వివరాలను ఎప్పటికప్పుడు సేకరించాలని అధికారులు సూచిస్తున్నారు.

## ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి గారి చేత
### చిలుకనగర్‌లో ఉచిత కంటి వైద్య శిబిరం ప్రారంభించబడింది



**ఉప్పల్ మే 10 ( జనం సాక్షి ):** చిలుకనగర్ డివిజన్ పరిధిలోని కల్యాణపురి కమ్యూనిటీ హాల్‌లో బీఆర్ఎస్ పార్టీ నాయకుడు నేర్థం భాస్కర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరానికి స్థానిక ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశమని తెలిపారు. సమాజంలోని ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్య సేవలు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. ముఖ్యంగా పేద మరియు మధ్యతరగతి కుటుంబాలకు ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. శిబిరంలో నిపుణులైన వైద్యులు పాల్గొని ప్రజలకు కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు, కళ్లజోళు అందజేశారు. కంటి సమస్యలతో బాధపడుతున్న పలువురు స్థానికులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని వైద్యుల సూచనలు పొందారు. పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్నారు. ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ సేవా కార్యక్రమాలు సమాజానికి ఎంతో మేలు చేస్తాయని, ఆరోగ్య సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడానికి ఇలాంటి కార్యక్రమాలు నిరంతరం కొనసాగాల్సిన అవసరం ఉందని అన్నారు. భవిష్యత్తులో కూడా మరిన్ని ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించేందుకు తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, వైద్య సిబ్బంది, సేవా సంస్థల ప్రతినిధులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## శ్రేయాస్ ఇంజినీరింగ్ కళాశాలలో ముగిసిన అంతర్జాతీయ సదస్సు




**అబ్దుల్లాపూర్ మెట్, మే 10(జనం సాక్షి ):** శ్రేయాస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో మే 8, 9 తేదీలలో నిర్వహించిన "సస్టైనబుల్ మ్యాథమెటికల్ మోడలింగ్ అండ్ కంప్యూటేషనల్ టెక్నిక్స్ (ఎస్ఎంఎంసీటీ--2026)" అంతర్జాతీయ సదస్సు ఘన విజయాన్ని సాధించింది. ఈ సదస్సుకు భారతదేశంతో పాటు విదేశాల నుండి కూడా పరిశోధకులు, అధ్యాపకులు, శాస్త్రవేత్తలు, పరిశ్రమ నిపుణులు, విద్యార్థులు భారీ సంఖ్యలో హాజరయ్యారు.ఈ సదస్సులో కృత్రిమ మేధస్సు, గణిత నమూనాల రూపకల్పన, కంప్యూటేషనల్ టెక్నిక్స్, డేటా సైన్స్, సుస్థిర ఇంజినీరింగ్ వంటి ఆధునిక సాంకేతిక రంగాలకు సంబంధించిన అనేక పరిశోధనా పత్రాలు సమర్పించబడ్డాయి. దేశ విదేశాల నుండి వచ్చిన ప్రతినిధులు సాంకేతిక సెషన్లలో పాల్గొని తమ పరిశోధన ఫలితాలను వివరించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హెచ్‌సీయూకు చెందిన ప్రొఫెసర్ సీబా కె. ఉద్గాత, జేఎన్‌టీయూకు చెందిన డాక్టర్ వీ. కామాక్షి ప్రసాద్ హాజరై విద్యార్థులు, పరిశోధకులను ఉద్దేశించి ప్రసంగించారు. సుస్థిర సాంకేతికత, అంతరశాఖ పరిశోధనల ప్రాధాన్యతను వారు వివరించారు.అలాగే భారతదేశం మరియు విదేశాల నుండి సుమారు 10 మంది ప్రముఖ కీనోట్ స్పీకర్లు పాల్గొని హై పర్‌ఫార్మెన్స్ కంప్యూటింగ్, కృత్రిమ మేధస్సు, కంప్యూటేషనల్ రీసెర్చ్, గణిత నమూనాల రూపకల్పన వంటి అంశాలపై విశేష ఉపన్యాసాలు అందించారు.ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ ఎ. హృదయ్ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ సి. ఉదయ కిరణ్, వివిధ విభాగాధిపతులు, డీన్లు, అధ్యాపకులు, నిర్వాహక బృంద సభ్యులు పాల్గొన్నారు. సదస్సును విజయవంతంగా నిర్వహించిన నిర్వాహకులను వారు అభినందించారు.ఈ అంతర్జాతీయ సదస్సు ద్వారా పరిశోధకులకు పరస్పర జ్ఞాన వినిమయం, పరిశోధనా సహకారం, అంతర్జాతీయ అకాడమిక్ సంబంధాల విస్తరణకు మంచి వేదిక లభించిందని కళాశాల యాజమాన్యం పేర్కొంది.

## ఉప్పల్ ప్రభుత్వ పాఠశాలలకు భారీ వరం
### రూ.37 కోట్లతో అభివృద్ధి పనులు



ఉప్పల్ మే 10 ( జనం సాక్షి ): మెడ్చల్--మల్కాజిగిరి జిల్లాలోని ఉప్పల్ నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం భారీగా నిధులు మంజూరు చేయడం విద్యా రంగంలో కీలక ముందడుగుగా మారింది. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం, ఆధునిక సౌకర్యాలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని జెడ్పీహెచ్‌ఎస్ సహా పలు ప్రభుత్వ పాఠశాలల అప్‌గ్రేడేషన్ కోసం మొత్తం రూ.37 కోట్ల నిధులు కేటాయించినట్లు అధికారులు వెల్లడించారు. ఈ నిధులతో అదనపు తరగతి గదుల నిర్మాణం, పాత భవనాల మరమ్మతులు, విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతుల కల్పన, ఆధునిక సైన్స్ మరియు కంప్యూటర్ ల్యాబ్‌ల ఏర్పాటు, తాగునీరు మరియు పారిశుద్ధ్య సదుపాయాల మెరుగుదల వంటి పలు అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. విద్యార్థుల సంఖ్య పెరుగుతున్న పాఠశాలల్లో ఉన్నత తరగతుల ఏర్పాటుకు కూడా ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం అనేక ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కొరత కారణంగా విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఈ భారీ నిధులను మంజూరు చేసినట్లు అధికారులు తెలిపారు. కొత్త తరగతి గదులు, ఆధునిక ల్యాబ్‌లు, మెరుగైన విద్యా సదుపాయాలు అందుబాటులోకి రావడంతో ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రుల్లో విశ్వాసం మరింత పెరిగే అవకాశముందని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. ప్రత్యేకంగా గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేట్ విద్యాసంస్థలకు దీటుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని అధికారులు చెబుతున్నారు. ఈ అభివృద్ధి పనులు పూర్తయితే వేలాది మంది విద్యార్థులకు నేరుగా ప్రయోజనం చేకూరనుంది. విద్యా ప్రమాణాలు మెరుగుపడటంతో పాటు భవిష్యత్తులో మరింత మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరే అవకాశాలు ఉన్నాయని భావిస్తున్నారు. ఈ సందర్భంగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ నిధులు మంజూరు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఉప్పల్ నియోజకవర్గంలోని ప్రతి ప్రభుత్వ పాఠశాల అభివృద్ధి తన లక్ష్యమని, విద్యార్థులకు మెరుగైన విద్య అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో పాఠశాలల్లో మరిన్ని సౌకర్యాలు కల్పించి, విద్యార్థుల భవిష్యత్తును మరింత బలోపేతం చేసే దిశగా కృషి కొనసాగిస్తామని పేర్కొన్నారు.

## మొక్కజొన్న వారి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి



**బంట్వారం మే 10 (జనం సాక్షి)** మక్కజొన్న, వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి మహిపాల్ డిమాండ్ చేశారు. శని వారం బంట్వారం మండల కేంద్రంలో పర్య టన చేసి, మక్కజొన్న, పసుపు రైతులు రోడ్లపై కల్లాలలో నిల్వ చేసిన ధాన్యాన్ని పరి శీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ మక్కజొన్న, వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల పంటను కొనుగోలు చేయాలన్నారు. అలాగే రైతుల బ్యాంక్ ఖాతాల్లో డబ్బులు జమ చేయాల న్నారు. జిల్లాలో తేమ, తరుగు పేరుతో జరిగే దోపిడిని అరికట్టాలని సూచించారు. కొను గోలు కేంద్రాల్లో రైతులకు కనీస వసతులు కల్పించాలన్నారు. లేని పక్షంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు ప్రకాశం, శ్రీనివాస్, ప్రశాంత్, ఈశ్వర్, అశోక్, కృష్ణ నరసింహా పాల్గొన్నారు.

# ఉప్పల్‌లో గృహిణి అదృశ్యం

## కుటుంబ కలహాల నేపథ్యంలో ఇంటి నుంచి వెళ్లిపోయిన మహిళ



**ఉప్పల్ మే 10 ( జనం సాక్షి ):** మెడ్చల్--మల్కాజిగిరి జిల్లాలోని ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ గృహిణి అదృశ్యమైన ఘటన స్థానికంగా ఆందోళన కలిగిస్తోంది. కుటుంబ కలహాల నేపథ్యంలో ఇంటి నుంచి బయటకు వెళ్లిన మహిళ తిరిగి రాకపోవడంతో భర్త పోలీసులను ఆశ్రయించగా, పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పల్ ఆదర్శనగర్ కాలనీలో నివాసం ఉంటున్న సారంగా జమున (36) తన భర్త రాముడు, పిల్లలతో కలిసి జీవిస్తోంది. కొంతకాలంగా కుటుంబ విషయాలపై ఇంట్లో తరచూ గొడవలు జరుగుతున్నట్లు సమాచారం. ఈ నెల 3వ తేదీన కూడా కుటుంబ సభ్యులతో జరిగిన వాగ్వాదం అనంతరం జమున తీవ్ర మనస్తాపానికి గురైనట్లు తెలుస్తోంది. అదే రోజు మధ్యాహ్నం సుమారు 2.30 గంటల సమయంలో ఆమె ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని కుటుంబ సభ్యులు తెలిపారు. మొదట బంధువులు, పరిచయస్తుల వద్ద వెతికినా ఎలాంటి సమాచారం లభించకపోవడంతో భర్త రాముడు ఈ నెల 9వ తేదీన ఉప్పల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మహిళ ఆచూకీ కోసం ప్రత్యేక గాలింపు చర్యలు చేపడుతూ, పరిసర ప్రాంతాల్లో విచారణ నిర్వహిస్తున్నారు. అలాగే సీసీ కెమెరాల ఫుటేజ్, మొబైల్ కాల్ వివరాలను కూడా పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఫోటోలో ఉన్న మహిళ ఆచూకీ ఎవరికైనా తెలిసినట్లయితే వెంటనే ఉప్పల్ పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని పోలీసులు కోరుతున్నారు. ఈ ఘటనతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

# బండి భగీరథ్‌ను వెంటనే అరెస్ట్ చేయాలి

## సిపిఐ (ఎం)రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ

**ముషీరాబాద్ మే 10 (జనం సాక్షి):** బీజేపీ నాయకులు, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ ఒక మైనర్ బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడడాన్ని సీపీఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. భగీరథ్‌పై ఫోక్సో చట్టం ప్రకారం కేసు నమోదు చేసి చేతులు దులుపుకోవడం కాకుండా హోంశాఖ, డీజీపీ ఈ కేసు విషయంలో కఠినంగా వ్యవహరించాలని, తక్షణమే అరెస్ట్ చేసి, బాధిత కుటుంబానికి రక్షణ కల్పించాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆదివారం సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ ఒక ప్రకటన విడుదల చేశారు. వేధింపులపై ఫిర్యాదు చేసేందుకు వెళ్లిన బాధితురాలి కుటుంబంపైనే కరీంనగర్‌లో అక్రమంగా కేసులు బనాయించారన్నారు. నిందితుడి వేధింపులు, పోలీసుల వేధింపులు తట్టుకోలేక బాలిక రెండుసార్లు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందనీ చెప్పారు. భగీరథ్ పై గతంలోనూ మహేంద్ర యూనివర్సిటీలో ర్యాగింగ్ వంటి కేసులు ఉన్నాయన్నారు. బండి సంజయ్ తన రాజకీయ, అధికార బలంతో కేసును ఉపసంహరించుకోవాలంటూ బాధితులపై దాడులు జరిపే అవకాశం ఉందనీ, కేసును పక్కదోవ పట్టించే పరిస్థితి కనపడుతున్నదనీ, తక్షణమే బాధితురాలు, ఆమె కుటుంబానికి పూర్తిస్థాయి రక్షణ కల్పిస్తూ, బాలిక కుటుంబంపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని సీపీఐ(ఎం) డిమాండ్ చేస్తుందన్నారు.

# అంజన్నపై ప్రేమతో పతంగి మొక్కలు నాటిన గిరిపుత్రులు

## మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ పుట్టినరోజునా  అభిమానం చాటిన గ్రీన్ ఛాలెంజ్ మండల కో ఆర్డినేటర్ వినోద్ నాయక్

**జిల్లేడు చౌదరిగూడ (జనంసాక్షి)** ఇష్టమైన నాయకునిపై కార్యకర్తలు పెంచుకునే అభిమానానికి అవదులుండవు.. అంతే స్థాయిలో నాయకులు కార్యకర్తపై చూపించే ప్రేమకు మరేదీ సరితూగదు.. ఈ రెండు అంశాలు సరి సమానంగా ఉంటాయి... మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ పుట్టినరోజునా  చింతకుంటతాండ గిరిపుత్రులు వినోద్ నాయక్.., రామ్ చరణ్ లు పతంగి మొక్కలు నాటి అభిమానం చాటారు.   ఆదివారం జిల్లేడు చౌదరిగూడెం మండల పరిధిలోని చింతకుంట తండా గ్రామపంచాయతీ గోలబండ తాండ ప్రాథమిక పాఠశాలో తన  పుట్టినరోజు సందర్భంగా గ్రీన్ చాలెంజ్ మండల కోఆర్డినేటర్ వినోద్ నాయక్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో  బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సయ్యద్ హాఫీజ్ మాట్లాడుతూ. బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం అనునిత్యం కృషి చేస్తున్న నేత మాజీ ఎమ్మెల్యే అని కొనియాడారు. ఆయనపై యువకులు మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టడం, అభిమానం చూపించడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సర్పంచ్ లు చింతకుంట తండా దేవి రాంచరణ్, ముష్టిపల్లి కన్న జంగయ్య,ఉప సర్పంచ్‌లు కన్న మల్లేష్, ధీమా గణేష్,జె



గబ్రు,మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు మాజీ ఎంపీటీసీ సత్య ప్రమోద్,పడకంటి వెంకటేష్, కోండి యాదయ్య, క్యాత్రమోని నర్సింలు, బాసు నరసింహులు, సంజీవ్ రెడ్డి,మొతిల్ నాయక్, శివరాజ్,నీల్యానాయక్,రమేష్, జంగీర్,యువ నాయకులు చెందు, మల్లేష్,కన్న మల్లేష్, సురేష్,దశరథ్ నాయక్,సేవ్యానాయక్, శంకర్ నాయక్, విశాల్,శ్రీను,గోపాల్, నరేష్, మండల మాజీ బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా ఇంచార్జీ సత్యం ముదిరాజ్   తదితరులు పాల్గొన్నారు.

# తాండూరులో విజయవంతమైన తుంటి మార్పిడి శస్త్రచికిత్స

## ఆసుపత్రి వైద్యులకు కృతజ్ఞతలు తెలిపిన కుటుంబ సభ్యులు



**తాండూరు మే 10 (జనంసాక్షి)** తాండూరులోని బాలాజీ నర్సింగ్ హోమ్‌లో 59 ఏళ్ల సులోచన అనే మహిళకు విజయవంతంగా తుంటి మార్పిడి శస్త్రచికిత్స నిర్వహించారు. రెండేళ్ల క్రితం పడిపోవడం వల్ల తుంటి ఎముక విరిగి, నాటు వైద్యం చేయించుకోవడంతో ఆమె తీవ్రమైన నొప్పితో బాధపడుతున్నారు. పరీక్షల్లో ఎడమ తుంటి వద్ద నెక్ ఆఫ్ ఫీమర్ ఫ్రాక్చర్ నిర్లక్ష్యం కారణంగా కాలు 2 సెం.మీ. పొట్టిగా మారినట్లు వైద్యులు గుర్తించారు. ఈ సమస్యకు పరిష్కారంగా మే 9వ తేదీన డాక్టర్ బి విహాసిత్ మరియు డాక్టర్. శరత్ చంద్ర నేతృత్వంలోని వైద్య బృందం సిమెంట్ లేని టోటల్ హిప్ రీప్లేస్‌మెంట్ శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తి చేశారు. డాక్టర్. మోహన్ అనస్థీషియా అందించగా, డా. విజయ్ జమాదార్ అసిస్టెంట్‌గా వ్యవహరించారు. టెక్నీషియన్‌గా నూరీ సహకరించారు. ప్రస్తుతం రోగి కోలుకుంటున్నారు. వైద్య సూచనల ప్రకారం తదుపరి చికిత్స కొనసాగుతుందనివెల్లడించారు.దీంతో కుటుంబ సభ్యులు బాలాజీ నర్సింగ్ హోమ్ వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

# దేవాలయాలు క్రమశిక్షణ భక్తిని పెంపొందించే ఆధ్యాత్మిక కేంద్రాలు

## దేవాలయాల అభివృద్ధికి సహకారం అందిస్తున్నా.: ఎమ్మెల్యే ముఠాగోపాల్



**ముషీరాబాద్, మే 10 (జనం సాక్షి):** భారతీయ సంస్కృతిలో దేవాలయాలు కేవలం ప్రార్థనా స్థలాలు మాత్రమే కావనీ, అవి శాంతి, క్రమశిక్షణ భక్తిని పెంపొందించే ఆధ్యాత్మిక కేంద్రాలు అని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ పేర్కొన్నారు. గాంధీనగర్ సిద్ధంశెట్టి అపార్ట్మెంట్స్ ఆవరణలో ఉన్న బంగారు పోచమ్మ దేవాలయం పునర్ నిర్మించారు. ఈ సందర్భంగా ఆదివారం శిఖర ప్రతిష్ట మహోత్సవం, ప్రత్యేకపూజ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ముఠాగోపాల్ సరోజ దంపతులు. బిఆర్ఎస్ పార్టీ యువ నాయకుడు ముఠా జయసింహ లుహాజరై ప్రత్యేక పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముఠాగోపాల్ మాట్లాడుతూ ముషీరాబాద్ నియోజకవర్గం పరిధిలో ఉన్న అనేక దేవాలయాల అభివృద్ధికి తన వంతు సహకారం అందించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కన్వీనర్ ముఠా నరేష్, చైర్మన్ మనీ అధ్యక్షుడు బసవరాజ్, కార్యదర్శి జితేంద్ర , ట్రెజరర్ లక్ష్మి ,జాయింట్ సెక్రెటరీ ప్రసన్న,ఆర్గనైజర్ సుబ్బరాయుడు, విజయ్ మురళి మనోహర్, గాంధీనగర్ డివిజన్ పార్టీ మాజీ అధ్యక్షుడు డివిజన్ అధ్యక్షులు రాకేష్ ,కార్యదర్శి శ్రీకాంత్, దేవేందర్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# యువత విద్యార్థులు క్రీడలపై దృష్టి సాధించాలి

## హైదరాబాద్ తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షుడు బి. కృష్ణ

**ముషీరాబాద్, మే 10 (జనం సాక్షి):** యువత, విద్యార్థులు క్రీడలపై దృష్టిసారించాలని హైదరాబాద్ తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షుడు బి. కృష్ణ సూచించారు. ఈ మేరకు ఆదివారం ముషీరాబాద్ సమీపంలోని గాంధీనగర్ డివిజన్ జిహెచ్ఎంసి ప్లే గ్రౌండ్, లో హైదరాబాద్ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో 60 మంది విద్యార్థులకు గ్రేడింగ్ కలర్ బెల్ట్స్ సర్టిఫికెట్లు, మెడల్స్ లను మాస్టర్ బి. కృష్ణ, ప్రధాన కార్యదర్శి , మీర్ వహాజ్ అలీ ఖాన్ లు అందజేశారు. ఈ సందర్భంగా మాస్టర్ బి, కృష్ణ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్రీడాకారులను ప్రోత్సహించేందుకు అనేక పథకాలు ప్రవేశపెట్టారని వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. క్రీడల్లో రాణించే వారికి ఉజ్వల భవిష్యత్ ఉంటుందని



అన్నారు. విద్య, ఉద్యోగ రంగాల్లో క్రీడాకారులకు రిజర్వేషన్ సైతం కల్పిస్తున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రేటర్ తైక్వాండో అసోసియేషన్ నాయకులు సీనియర్ కోచ్ లు లక్ష్మీనారాయణ స్వామి, విష్ణు, కళ్యాణ్, సాహస , హరిణి, సహస్ర , దిరాజ్ , క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

# బండి భగీరథను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలి

**ముషీరాబాద్, మే 10 (జనం సాక్షి):** మైనర్ బాలికపై అత్యాచారం చేసిన కేంద్ర హోమ్ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథ్ ను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆదివారం (ఐద్వా) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి తెలంగాణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఒక ప్రకటన విడుదల చేశారు. మైనర్ బాలికపై లైంగిక దాడి వంటి అమానుష ఘటనలు సమాజానికి అవమానం అని, నిందితుడు ఎంతటి వాడైనా రాజకీయ కుటుంబానికి చెందిన వాడైనా చట్టం ముందు ప్రత్యేక హక్కులు ఉండకూడదన్నారు. ఈ కేసులో పోలీసులు నిష్పక్షపాతంగా, వేగంగా దర్యాప్తు నిర్వహించి, వాస్తవాలను వెలికి తీయాలనీ కోరారు. బాధిత బాలికకు పూర్తి రక్షణ, మానసిక ధైర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేసును ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా విచారించాలి, ఆరోపణలు రుజువైతే కఠినమైన శిక్ష విధించాలన్నారు. రాజకీయ ఒత్తిళ్లు లేదా అధికార బలం ద్వారా కేసును బలహీనపర్చే ప్రయత్నాలు జరిగితే ఊరుకోమనీ హెచ్చరించారు. మహిళల, బాలికల భద్రతను కాపాడటం ప్రభుత్వ బాధ్యతనీ, న్యాయం జరిగే వరకు ఈ కేసును పారదర్శకంగా ముందుకు తీసుకెళ్లాలని ఐద్వా తెలంగాణ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది.

# ఓటు వజ్రాయుధం



**హయత్ నగర్, మే 10 (జనం సాక్షి)**హయత్ నగర్ సర్కిల్ అన్మగల్ హయత్ నగర్ జై భీమ్ అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జెనిగె విష్ణువర్ధన్ ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి 179వ ఆదివారం జ్ఞానమాల సమర్పించి, భారత రాజ్యాంగ నిర్మాణం కోసం ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా జెనిగె విష్ణువర్ధన్ మాట్లాడుతూ డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగం ద్వారా కల్పించిన ఓటు హక్కు భారత ప్రజలకు వజ్రాయుధం లాంటిదని అన్నారు. ప్రజల ఓటుతో గద్దెనెక్కిన పార్టీలు నిస్వార్థంగా ప్రజలకు సేవ చేసినంత కాలం ప్రజల అభిమానాన్ని ఆశీర్వాదాన్ని పొందుతారని, ఎప్పుడైతే ప్రజా సమస్యలను విస్మరించినప్పుడు ప్రజలు ఓటుతో తమకు గుణపాఠం చెప్తారని తెలిపారు. తమిళనాడు ఎన్నికల ఫలితాలు అందుకు నిదర్శనం అని, ఇలాంటి అమూల్యమైన ఓటు హక్కును కల్పించిన డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ సేవలను నిత్యం స్మరించుకుంటూ, ఆయన ఆశయాలను ఆకాంక్షలను ప్రతి ఒక్కరూ నెరవేర్చాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విగ్రహ దాత బోడ నరసింహ, గంగని కిషన్, గంగని రాము, కాటేపాక శివ కుమార్, బాపనపల్లి నాగరాజు, కామల్ల రాజు, బుగ్గల రాజు, బలరాం, పి ప్రమోద్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కోడంగల్‌లో విద్యా వారోత్సవాలు



**కొడంగల్ ,మే 10 (జనం సాక్షి):** ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కోడంగల్ లో తెలంగాణ ప్రభుత్వం ఆదేశించిన "ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక" 99 రోజుల కార్యాచరణలో భాగంగా, ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థుల ప్రవేశాల్ని మెరుగు పరచడం, సంస్థాగత అభివృద్ధి, విద్యార్థులలో నైపుణ్యాభివృద్ధి, ఉద్యోగ సన్నద్ధత, సామాజిక భాగస్వామ్యం వంటి సమున్నత లక్ష్యాలతో ఈ నెల 11 నుండి 17 వ తేదీ వరకు విద్యా వారోత్సవాలు నిర్వహించనున్నామని ప్రిన్సిపాల్ డా. బి. శ్రీనివాస్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు కార్యక్రమ ప్రారంభం మరియు అవగాహన కార్యక్రమాలు, రెండవ రోజు సంస్థాగత అభివృద్ధి కార్యక్రమాలు, మూడవ రోజు సృజనాత్మక మరియు నైపుణ్య అభివృద్ధి కార్యక్రమాలు, నాలుగవ రోజు సిబ్బంది వృత్తి పర అభివృద్ధి కార్యక్రమాలు, 5 వ రోజు విద్యార్థి భాగస్వా మ్యం, 6వ రోజు పారిశ్రామిక అనుసంధాన కార్యక్రమాలు, చివరి రోజు విజేతలను అభినందించే కార్యక్రమాలు కార్యక్రమ పునః శ్చరణ, నివేదిక సమర్పణ ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, సిబ్బంది ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమ స్ఫూర్తిని ఇనుమడింపజేయాలని కోరారు.

## మోదీ సభకు కిస్మత్పూర్ బీజేపీ శ్రేణుల ర్యాలీ

**రాజేంద్రనగర్,మే10(జనంసాక్షి)**సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో నేడు నిర్వహించనున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భారీ బహిరంగ సభకు రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని కిస్మత్పూర్ 122 డివిజన్ నుంచి బీజేపీ శ్రేణులు భారీగా తరలివెళ్లాయి. బీజేపీ రాష్ట్ర నాయకులు మహేలింగం, అన్నపురెడ్డి భీమార్జున్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా బీజేపీ కార్యనిర్వాహక సభ్యులు వీరుడు శేఖర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో నాలుగు బస్సులతో మహిళలు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి భారీ ర్యాలీగా సభకు బయలుదేరారు.సభకు వెళ్లే ముందు కిస్మత్పూర్ వీధుల్లో బీజేపీ జెండాలు, నినాదాలతో కార్యకర్తలు ఉత్సాహంగా ర్యాలీ నిర్వహించారు. దాదాపు 400 మందికి పైగా స్వచ్ఛందంగా సభకు హాజరుకావడం ఆనందంగా ఉందని నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు నీరుడు పవన్ సాయి, అన్నపురెడ్డి శ్రీనివాస్ రెడ్డి, వెంకటేష్, ఎస్. స్వామి, శేఖర్, లక్ష్మణ్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు. దేశ అభివృద్ధి కోసం ప్రధాని నరేంద్ర మోదీ అమలు చేస్తున్న కార్యక్రమాలకు ప్రజల్లో విశేష ఆదరణ లభిస్తోందని, రాబోయే రోజుల్లో తెలంగాణలో బీజేపీ జెండా ఎగరవేయడం ఖాయమని నాయకులు విశ్వాసం వ్యక్తం చేశారు.



## కాకతీయుల కాలం నాటి ఎర్రకుంట చెరువు కట్ట ధ్వంసం: సిపిఎం బృందం పరిశీలన



**యాచారం, మే 10(జనం సాక్షి )**యాచారం మండల పరిధిలోని ధర్మన్నగూడా గ్రామంలో సర్వే నంబర్ 155లో ఉన్న కాకతీయుల కాలం నాటి చారిత్రక ఎర్రకుంట చెరువు కట్టను స్థానిక భూస్వాములు ధ్వంసం చేసిన ప్రదేశాన్ని శనివారం సిపిఎం పార్టీ బృందం పరిశీలించింది.ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పి. అంజయ్య మాట్లాడుతూ, పట్టా భూముల సర్వే నంబర్లను అనుసరించి కాకతీయుల కాలంలో నిర్మించిన ఈ చిన్న చెరువే గ్రామానికి ప్రధాన నీటి ఆధారం అని తెలిపారు. పూర్వ కాలంలో చెరువు పూర్తిగా నిండినప్పుడు పంట పొలాలకు నీరు అందేదని, మూగజీవాలు, పశువులు, గొర్రెలు, పక్షులకు తాగునీరు లభించేదని గుర్తు చేశారు. పట్టా భూమిలో చెరువు, కట్ట ఉన్నాయి" అనే సాకుతో స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో భూస్వాములు యథేచ్ఛగా కట్టను ధ్వంసం చేశారని ఆరోపించారు. అంతేకాకుండా నీళ్లు నిలిచే స్థలంలో మట్టి నింపి కబ్జా చేసే ప్రయత్నం చేస్తున్నారని, ఇతర పొలాల నుండి చెరువులోకి నీళ్లు వచ్చే కాలువలను కూడా మూసివేశారని తెలిపారు.ఈ సందర్భంగా సిపిఎం మండల కమిటీ సభ్యులు ఎం బాల్ రాజ్ మాజీ సర్పంచి మాజీ భాషయ్య వైస్ ఎంపీపీ ఎం శ్రీమన్నారాయణ మాట్లాడుతూ ఈ విషయంపై జిల్లా కలెక్టర్, ఇరిగేషన్, హైడ్రా అధికారులను కలుస్తామని తెలిపారు. అధికారులు వెంటనే స్పందించి కట్టను ధ్వంసం చేసిన భూస్వాములపై చర్యలు తీసుకోవాలని, కట్టను యథావిధిగా పునర్నిర్మించి, చెరువులో పోసిన మట్టిని తొలగించాలని విజ్ఞప్తి చేశారు. లేని యెడల సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనకు పూనుకుంటామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ శాఖ కార్యదర్శి పి. రమేష్, రాములు, సత్తయ్య. సత్యనారాయణ, గోపాల కృష్ణ, హన్మంతు, ఆనంద్, వినయ్, జంగయ్య, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

## రోజా రాణి వర్ధంతి సందర్బంగా మెగా వైద్య శిబిరం



**కూకట్ పల్లి, మే 10(జనంసాక్షి** కేపీహెచ్‌బీ కాలనీ వసంత్‌నగర్ డివిజన్ సర్దార్ పటేల్‌నగర్‌లో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మండలపు సాయి బాబు చౌదరి సతీమణి కీర్తిశేషులు మండలపు రోజా రాణి మూడవ వర్ధంతి సందర్భంగా మండలపు రోజా రాణి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో, యశోద హాస్పిటల్స్ హైటెక్ సిటీ సహకారంతో డాక్టర్ సోమశేఖరరావు నేతృత్వంలో మెగా వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో బీపీ, 2డీ ఎకో, ఫైబ్రో స్కాన్, జీఆర్‌బీఎస్, ఈసీజీ, కంటి పరీక్షలు తదితర వైద్య పరీక్షలు నిర్వహించగా సుమారు 300 మంది కాలనీవాసులు సేవలు పొందారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జ్, పీసీసీ వైస్ ప్రెసిడెంట్, కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ ప్రజలు తరచూ ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. సాయి బాబు చౌదరి ప్రజా సేవలో ముందుంటూ పేదల కోసం అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని ప్రశంసించారు. డాక్టర్ సోమశేఖరరావు మాట్లాడుతూ ఫ్యాటీ లివర్ సమస్యలపై అవగాహన కల్పిస్తూ, ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఫైబ్రో స్కాన్ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## తార్నాక నుండి ప్రధాని సభకు బయలుదేరిన మహిళ కార్యకర్తలు

**మే 10(జనంసాక్షి)**సికింద్రాబాద్ పెరేడ్ గ్రౌండ్ లో నిర్వహించిన ప్రధాని మోదీ సభకు తార్నాక నుండి మహిళా నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. మహంకాళి జిల్లా అధ్యక్షుడు భరత్ గౌడ్ పిలుపుమేరకు మోదీ సభకు వెళ్లే మహిళల కోసం సామాజిక కార్యకర్త, బిజెపి నాయకులు శ్రీరామ్ వెంకటేష్ రెండు బస్ లను ఏర్పాటు చేశాడు. శ్రీరామ్ వేదిత ఆధ్వర్యంలో మహిళ కార్యకర్తలు పెద్ద ఎత్తున సమీకృతమై సభకు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా శ్రీరామ్ వెంకటే మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై ప్రజలే స్వచ్ఛందంగా ముందుకు రావడం సంతోషకరమన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి విస్తృతమైన అవగాహన కల్పించాలని సూచించారు. రానున్న రోజుల్లో తెలంగాణలో బిజెపి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.



## బీజేపీ ఫ్లెక్సీల తొలగింపుపై వినయ్ రెడ్డి ఆగ్రహం



**రాజేంద్రనగర్,మే10(జనం సాక్షి)**తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ పార్టీకి చెందిన ఫ్లెక్సీలు, బ్యానర్లు, ప్రధాని నరేంద్ర మోదీ పోస్టర్లను లక్ష్యంగా చేసుకుని జిహెచ్ఎంసి సిబ్బంది తొలగించడం తీవ్రంగా ఖండిస్తున్నామని మైలార్ దేవ్‌పల్లి డివిజన్2వ అధ్యక్షుడు సూరెడ్డి వినయ్ పేర్కొన్నారు. రాష్ట్రవ్యా ప్తంగా కేవలం ఒకే పార్టీ ప్రచార సామగ్రిపై చర్యలు తీసుకోవడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధ మని అన్నారు.కాంగ్రెస్ నాయకుల ఒత్తిడితో జిహెచ్ఎంసి అధికా రులు పనిచేస్తున్నారనే అనుమానాలు ప్రజల్లో పెరుగుతున్నా యని ఆయన ఆరోపించారు. అనుమతులతో ఏర్పాటు చేసిన బీజేపీ ఫ్లెక్సీ లను తొలగించడం అన్యాయమని, ఇతర పార్టీల పోస్టర్లపై చర్యలు తీసుకోకపోవడం ద్వంద్వ వైఖరికి నిదర్శనమని విమర్శించారు .ఇలాంటి చర్యలు కొనసాగితే జిహెచ్ఎంసి కార్యాలయాల వద్ద భారీ స్థాయిలో ప్రజాస్వామ్యబద్ధ నిరసనలు చేపడతామని హెచ్చరించారు. రాజకీయ ఒత్తిళ్లకు లోనుకాకుండా అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి వివక్షపూరిత చర్యలపై స్పష్టత ఇవ్వాలని వినయ్ రెడ్డి డిమాండ్ చేశారు.

## రెండు లేగా దూడలు జన్మనిచ్చిన గోమాతకు హిందూ సాంప్రదాయబద్ధంగా బారసాలు



**మోమిన్ పేట మే 10 ( జనం సాక్షి )** మోమిన్ పేట మండలంలోని మో రంగపల్లి గ్రామంలో ఓ గోమాత రెండు లేగ దూడలు జన్మనిచ్చిన సంఘటన మండల పరిధిలో చోటుచేసుకుంది ఈ సంఘటనకు సంబంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి మోరంగపల్లి గ్రామానికి చెందిన పల్లె ఆనందం వద్ద ఉన్న గోమాత రెండు లేగ దూడలను ఆదివారం జన్మనిచ్చింది ఇదే విషయమై ఊరంతా తెలియగా ఊరందరూ కలిసి ఆడపడుచుకు చేసినట్టు పురుడు బారసాలు చేసి పండుగలా జరుపుకున్నారు గ్రామమంతా సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో జీవించాలని మాజీ ఎంపీపీ ఒగ్గు మల్లయ్య యాదవ్ ఆధ్వర్యంలో గ్రామంలో గోమాతకు ప్రత్యేక పూజలు చేసి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు

# తెలంగాణ రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ ఏర్పాటు హర్షనీయం

## కాంగ్రెస్ పార్టీ డిసిసి అధికార ప్రతినిధి వరికుప్పల సుధాకర్



**యాచారం,మే 10(జనం సాక్షి )** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా వడ్డెర కార్పొరేషన్ ఏర్పాటు అభినందనీయమని డిసిసి అధికార ప్రతినిధి వరికుప్పల సుధాకర్, నల్గొండ జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ బాలు అన్నారు. ఈ సందర్భంగా నూతనంగా వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ గా ఎన్నికైన గుంజ రేణుక నారాయణను వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వడ్డెరల కష్టాన్ని గుర్తించి ఎన్నికల మేనిఫెస్టో చెప్పిన మాట ప్రకారం వడ్డెర కార్పొరేషన్ ఏర్పాటు ఏర్పాటు చేసినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, సిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. వడ్డెర్ల ను ఎస్టీ జాబితాలో చేర్చే ప్రధాన డిమాండ్ ను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోవాలని ఈ సందర్భంగా నూతన చైర్మన్ కు విన్నవించారు. వడ్డెర కార్పొరేషన్కు ప్రత్యేక నిధులు కేటాయించి వడ్డెర్లకే చెందే విధంగా చూడాలని వారిలలో ప్రసర్లలో పూర్తి హక్కులు వడ్డెర కులస్తులకు మాత్రమే చెందేలా చూడాలని అన్నారు. పనిచేస్తూ ప్రమాదవశాత్తు మరణిస్తే వారికి ప్రభుత్వం తరఫున తగిన పారితోషకం ఇప్పించి ఆ కుటుంబంలో చదువుకునే వ్యక్తికి ప్రభుత్వ ఉద్యోగం వచ్చేలా ప్రయత్నించాలని అన్నారు. వడ్డెరల పిల్లలకు గురుకుల పాఠశాలలో ప్రత్యేకంగా సీట్లు కేటాయించే విధంగా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని నూతన చైర్మన్ కు విన్నవించారు. ఈ సందర్భంగా గుంజ రేణుక మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్నటువంటి అత్యంత వెనుకబడిన కులానికి చెందిన వడ్డెరల అభ్యున్నతికి తాను తప్పకుండా తోడ్పాటు అందిస్తానని వడ్డెర్ల అభివృద్ధికి కృషి చేస్తానని తన సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని తెలిపారు. ఇంటర్లో డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా కృషి చేస్తానని అన్నారు.

# డిజిటల్ పరికరాల మితిమీరిన వినియోగంతో మానసిక రుగ్మతలు పెరుగుతున్నాయి



**రాజేంద్రనగర్,మే10(జనంసాక్షి)**కంప్యూటర్లు, స్మార్ట్ ఫోన్లు వంటి డిజిటల్ పరికరాలను అధికంగా వినియోగించడం వల్ల పిల్లలు, యువతలో మానసిక సమస్యలు పెరుగుతున్నాయని ఎర్రగడ్డ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ సూపరింటెండెంట్ డాక్టర్ అనిత రాయిరాల ఆందోళన వ్యక్తం చేశారు. అండర్ స్ట్రెస్ లక్షణాలు కనిపించకుండా పెరుగుతున్న నేపథ్యంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.స్పార్క్, అహం సూత్ర మీడియా ఆధ్వర్యంలో ఆదివారం అత్తాపూర్ సర్కిల్ లక్ష్మీనగర్ పార్కులో నిర్వహించిన "టాకింగ్ సర్కిల్" మానసిక ఆరోగ్య అవగాహన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఆధునిక వైద్య చికిత్సలు అందుబాటులో ఉన్నప్పటికీ మానసిక రుగ్మతలు తగ్గకుండా పెరుగుతున్నాయని తెలిపారు. ఎర్రగడ్డ మెంటల్ హాస్పిటల్లో పేషెంట్ల సంఖ్యలో సుమారు 20 శాతం పెరుగుదల నమోదవడం ఆందోళనకరమన్నారు. పిల్లలు ఒంటరిగా ఉండడం, థెరపీ అవసరమని పరోక్షంగా సంకేతాలు ఇవ్వడం వంటి విషయాలను తల్లిదండ్రులు గమనించాలని సూచించారు.డిజిటల్ పరికరాల అధిక వినియోగం మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోందని, పిల్లలతో ప్రేమగా మెలిగి వారి భావోద్వేగాలను అర్థం చేసుకోవాలని చెప్పారు. పెద్దలు కూడా మానసిక ఆరోగ్య పరిరక్షణపై శ్రద్ధ వహించాలని సూచించారు.కార్యక్రమంలో జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ మల్లారెడ్డి, వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు మహేందర్, డాక్టర్ సీతారాం, సీనియర్ జర్నలిస్టు మేడం మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు. అహం సూత్ర మీడియా ఫౌండర్ రాచూరి అజిత్ వందన సమర్పణ చేశారు.

# లక్ష్మాపూర్లో గడిమైసమ్మ దేవాలయ పునరుద్ధరణ పనులకు శ్రీకారం



**శామీర్ పేట్, మే 10(జనం సాక్షి )**మూడుచింతలపల్లి మున్సిపాలిటీ పరిధిలో లక్ష్మాపూర్ గ్రామంలోని బొడ్డురాయి వద్ద ఉన్న గడిమైసమ్మ దేవాలయం శిథిలావస్థకు చేరుకుంది. కొన్ని వందల సంవత్సరాల క్రితం ఇక్కడ జాగీర్దార్ గడి ఉండేది. ఆ గడిలోనే మైసమ్మ అమ్మవారిని ప్రతిష్ఠించారు. పటేల్--పట్వారి వ్యవస్థ కాలంలో పోలీస్ పటేల్ కుటుంబం ఆనవాయితీగా ఇక్కడ మొదటి పూజలు నిర్వహించేది. అదే సంప్రదాయం నేటికీ కొనసాగుతోంది.గతంలో కురిసిన భారీ వర్షాల కారణంగా దేవాలయం పూర్తిగా దెబ్బ తిన్నది. దీంతో గ్రామ పెద్దలందరూ కలిసి స్థానిక కౌన్సిలర్ శ్రీవాణి వైద్యనాథ్ ఆధ్వర్యంలో గడి మైసమ్మ దేవాలయ పునరుద్ధరణ పనులను ప్రారంభించారు. పాత గుడిని యథాతథంగా ఉంచి, చుట్టూ పిల్లర్లు ఏర్పాటు చేసి పునర్నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు.పునరుద్ధరణ పనులకు అవసరమైన నిధులను గ్రామస్తుల నుంచి చందాల రూపంలో సేకరించి, రాబోయే బోనాల పండుగ నాటికి పనులు పూర్తి చేయ్యాలని గ్రామస్తు లందరూ తీర్మానించారు. వచ్చే వారం ఐదుగురు సభ్యులతో కమిటీ ఏర్పాటు చేసి పునరుద్ధరణ పనుల బాధ్యతలను అప్పగించాలని పెద్దలు నిర్ణయించారు.దేవాలయ పునరుద్ధరణ పనుల పర్యవేక్షణ స్థానిక కౌన్సిలర్లు శ్రీవాణి వైద్యనాథ్ , సరిత శ్రీనివాస్ స్వీకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ప్రతి పేదవాడి సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యం

**చేవెళ్ల, మే 10 (జనంసాక్షి)** అర్హులైన ప్రతి పేదవాడి సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని చేవెళ్ల మున్సిపల్ చైర్ పర్సన్ దేవర సమతా వెంకట్ రెడ్డి అన్నారు. చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని దామరగిద్ద వార్డ్ లో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటిని చేవెళ్ల మున్సిపల్ చైర్ పర్సన్ దేవర సమతా వెంకట్ రెడ్డి, కౌన్సిలర్, మాజీ సర్పంచ్ శైలజాఆగి రెడ్డి, దామరగిద్ద కౌన్సిలర్ తాళ్లపల్లి నర్సింలు, మాజీ సర్పంచ్ మధుసూదన్ గుప్తా,కలసి ఆదివారం నాడు ఘనంగా ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించారు. అనంతరం మున్సిపల్ చైర్ పర్సన్ మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి పేదవాడికి సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. అభివృద్ధిలో భాగంగా మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ కాసుల రాము గౌడ్, చేవెళ్ల, ముడిమ్యాల సొసైటీ చైర్మన్ లు దేవర వెంకట్ రెడ్డి, గోనే ప్రతాప్ రెడ్డి, కౌన్సిలర్లు మద్దెల శ్రీనివాస్, పెద్దోళ్ల దయాకర్, మార్కెట్ కమిటీ చైర్మన్ స్వామి, రాంచందర్, నవీన్, భీమ్ రాజ్, మారుతీ, శ్రీనివాస్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# జమాతే ఇస్లామీ హింద్ ఆధ్వర్యంలో కత్న సున్నాతులు ఉచిత వైద్య శిబిరం

**•ఉచితంగా మందులు పంపిణీ చేసిన ఎంఐఎం కౌన్సిలర్ సయ్యద్ షబ్బీర్ హుస్సేన్**




**వికారాబాద్ మే 10 (జనం సాక్షి)**జమాతే ఇస్లామీ హింద్ వికారాబాద్ శాఖ ఆధ్వర్యంలో ఉచిత సున్నత్ శిబిరం ఘనంగా నిర్వహించబడింది. సమాజ సేవా కార్యక్రమాలలో భాగంగా జమాతే ఇస్లామి హింద్ తరఫున గత ఇరవై ఐదు సంవత్సరాలుగా నిరంతరంగా నిర్వహిస్తున్న ఈ శిబిరం ప్రజల నుండి విశేష ఆదరణ పొందుతోంది.లోని మెషిన్ హాస్పిటల్లో నిర్వహించిన ఈ శిబిరంలో వందకు పైగా చిన్నారులకు అనుభవజ్ఞులైన వైద్యు మొహమ్మద్ అన్వాస్ షరీఫ్ పర్యవేక్షణలో సురక్షితంగా సున్నత్ చేయబడింది. కార్యక్రమానికి వచ్చిన తల్లిదండ్రులు నిర్వాహకుల సేవాభావాన్ని అభినందించారు.ఈ సందర్భంగా మాట్లాడిన అతిథులు, సమాజంలోని పేద మరియు అవసరమైన కుటుంబాలకు ఇలాంటి ఉచిత వైద్య సేవలు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. గత ఇరవై ఐదు సంవత్సరాలుగా నిరంతర సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న నిర్వాహకులను ప్రశంసించారు.కార్యక్రమంలో పలువురు అతిథులు, జమాతే ఇస్లామిక్ హింద్ అధ్యక్షులు రఫీ యుద్దీన్ .అల్ ఖైర్ సొసైటీ వికారాబాద్ అధ్యక్షులు అబ్దుల్ రావుఫ్. తన్వీర్ అలీ. ఇర్షాద్. షరీఫ్. సిద్దిక్ . సయ్యద్ అన్వర్ . హబీబ్ సహబ్. సామాజిక ప్రముఖులు, వైద్యులు సిబ్బంది మరియు స్వచ్ఛంద కార్యకర్తలు పాల్గొన్నారు. శివారెడ్డి పేట ఎంఐఎం కౌన్సిలర్ సయ్యద్ షబ్బీర్ హుస్సేన్ కత్ నా చేసుకున్న 120 మందికి ఉచిత మందులు పంపిణీ సొంత ఖర్చులతో చేశారు వైద్యస్ శిబిరం విజయవంతం కావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు

# బికేఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సూరారం రాజీవ్ గృహకల్పలో 36 వ ఉచిత వైద్య శిబిరం



**నిజాంపేట్ మే 10( జనం సాక్షి )** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కొంపల్లి సర్కిల్ సాయిబాబా నగర్ డివిజన్ రాజీవ్ గృహకల్పలో బి కేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 36 వ ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఫౌండేషన్ అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ ప్రోటోకాల్ ఒ కోఆర్డినేటర్ కమిటీ వైస్ చైర్మన్ బొంగునూరి కిషోర్ రెడ్డి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు .ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద మధ్యతరగతి ప్రజలు ఉచిత వైద్య సేవలు ఉపయోగించుకోవాలని అన్నారు.వైద్యంతో పాటు పేద మధ్యతరగతి పిల్లలకు విద్యకు ఎలాంటి ఇబ్బందులున్న బి కే ఆర్ ఫౌండేషన్ అండగా ఉంటుందన్నారు.కాలనీ ప్రజలకు సమస్యలు ఏమైనా ఉంటే సమస్య పరిష్కారమయ్యే వరకు అధికారులతోమాట్లాడి కృషి చేస్తానని తెలియజేశారు మాకు సహకరిస్తున్న సీఎంఆర్ హాస్పిటల్ వైద్య బృందానికి బిగ్ న్యూస్ యాజమాన్యానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో వారితోపాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఏ ఆర్ సాదు యాదవ్ నరసింహారెడ్డి గజేంద్ర ప్రజా గాయకుడు శంకర్ శ్రీశైలం యాదవ్ అరుణ్ రెడ్డి జగన్ ముదిరాజ్ రాజీవ్ గృహకల్ప కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

# రాజేంద్రనగర్ నుంచి మోదీ సభకు భారీగా తరలిన బీజేపీ శ్రేణులు

**రాజేంద్రనగర్,మే10(జనంసాక్షి)**సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్ లో నిర్వహించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బహిరంగ సభకు రాజేంద్రనగర్ ప్రాంతం నుంచి భాజపా కార్యకర్తలు భారీగా బస్సుల్లో బయలుదేరి వెళ్లారు. సభను విజయవంతం చేయాలని పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో గోల్కొండ గోషామహల్ ఇన్చార్జ్ శ్రీధర్, డివిజన్ మాజీ అధ్యక్షులు జి బాబురావు, డివిజన్ ఉపాధ్యక్షులు పవన్ రాజ్, డివిజన్ కార్యదర్శి కవిత, జిల్లా ఎస్సీ మోర్చా కార్యదర్శి గుడిసె యాదయ్య, జిల్లా ఎస్సీ మోర్చా కార్యవర్గ సభ్యులు పి రవీందర్, ప్రధాన కార్యదర్శి ఇ. వేణుగోపాల్, సీనియర్ నాయకులు జ్ఞానేశ్వర్, కిరణ్, రమణ తదితరులు పాల్గొన్నారు.



# శ్రీ లక్ష్మీనరసింహ్మా స్వామి కళ్యాణం కమనీయం

- వైభవంగా 4,వ వార్షిక బ్రహ్మోత్సవాలు
- కళ్యాణంలో అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు
- ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్



**తలకొండపల్లి మే 10 (జనంసాక్షి) :** తలకొండపల్లి మండల కేంద్రానికి ఉత్తర దిక్కున ఉన్న గుట్టపై స్వయంభువుగా వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి పురాతన ఆలయాన్ని గత 4 సంవత్సరాల క్రితం ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో కోట్లాది రూపాయలు వెచ్చించి పునర్ నిర్మించడం జరిగింది.శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ 4,వ వార్షికోత్సవంలో భాగంగా స్వామివారి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆదివారం శ్రీశ్రీశ్రీ లక్ష్మీనరసింహస్వామి కళ్యాణం వైభోగపేతంగా వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య పచ్చటి తోరణాలు,మంగళ వాయిద్యాలతో కమనీయంగా శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి కళ్యాణం అంగరంగ వైభవంగా జరిపించారు.స్వామివారి కల్యాణంలో భాగంగా స్వామి వారికి పట్టు వస్త్రాలంకరణలు, పూలు, పండ్లను ఉప్పల చారిటేబుల్ ట్రస్ట్ చైర్మన్ మంజుల వెంకటేష్ పుణ్య దంపతులు వస్త్రాలు సమర్పించారు.వేద పండితుల మధ్య జరిగే స్వామి వారి కళ్యాణంలో పుణ్య దంపతులు ఉప్పల మేఘన అఖిల్,భావన అనిల్ పుణ్య దంపతులు కూర్చుని స్వామి వారి కళ్యాణాన్ని జరిపించారు. ఆలయమంతా చూడముచ్చటగా కలర్ కలర్ లైట్లతో, రకరకాల పూలతో, పచ్చటి తోరణాలతో అలంకరించి స్వామివారి కల్యాణాన్ని జరిపించారు.ఈ కళ్యాణాన్ని చూడడానికి వివిధ గ్రామాల నుండి తండోపతండాలుగా భక్తులు తరలివచ్చి స్వామివారి కల్యాణాన్ని తిలకించారు.ఈ సందర్భంగా ఉప్పల చారిటేబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ మాట్లాడుతూ.. ప్రజలందరూ దైవ సేవ చేయడంతో పాటు,ప్రజాసేవ చేయడంలోనే మనశ్శాంతి లభిస్తుందని అన్నారు.తలకొండపల్లి మండల కేంద్రము నుండి ఒక కిలోమీటర్ దూరంలో 400 సంవత్సరాల చరిత్ర గల శ్రీశ్రీశ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వెలుశాడనీ పూర్వీకులు చెప్పేవారనీ పేర్కొన్నారు.అలాంటి దేవాలయాన్ని పునర్నిర్మానంతో నూతన వరవడికను సృష్టిస్తూ 4,కోట్ల రూపాయలతో మండలంలో ఒక గొప్ప నాందికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ప్రజలందరూ భక్తి భావంతోనే ముక్తి లభిస్తుందని నాయకులు ప్రజలకు సూచించారు.అనంతరం శృతిలయ కల్చర్ అకాడమీ ఆధ్వర్యంలో వేసవికాలంలో శిక్షణ పొందిన విద్యార్థులచే నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.ఈ కార్యక్రమంలో తలకొండపల్లి సర్పంచుల సంఘం అధ్యక్షులు కటికల శేఖర్ యాదవ్,మాజీ జెడ్పీటిసి పద్మ నరసింహ్మా, తలకొండపల్లి మాజీ సర్పంచ్ లలిత జ్యోతయ్య,ఉప సర్పంచ్ నూకం కోటీశ్వర్,బుచ్చిబాబు,నరసింహ్మా,పోతుగంటి మల్లేష్, ఉప్పల వెంకటేష్ మిత్రమండలి యువ నాయకులు విజయ్ కుమార్, సంపత్ కుమార్, విఠల్, కోర్ర కృష్ణ నాయక్, వెంకటేష్, నవీన్ గుప్త, మనోహర్, శ్రీను. భక్తులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.







## బాలుడి ఆచూకీ తెలిస్తే తెలియజేయండి

**హయత్ నగర్, మే 10 (జనం సాక్షి) :** హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో సుమారు 12 సంవత్సరాల వయస్సు గల మల్లేష్ అనే బాలుడు సంచరిస్తూ కనిపించాడు. బాలుడిని విచారించగా తన ఇంటి చిరునామా, తల్లిదండ్రుల వివరాలు గాని చెప్పలేకపోతున్నాడు. బాలున్ని సైదాబాద్ లోని బాలల గృహానికి తరలించామని, బాలుడి కుటుంబ సభ్యుల గురించి ఎవరికైనా సమాచారం తెలిస్తే హయత్‌నగర్ పోలీస్ స్టేషన్‌ను ఫోన్ నెంబర్ 87126 62640 సంప్రదించగలని, హయత్ నగర్ ఎస్ హెచ్ ఓ నాగరాజు గౌడ్ తెలిపారు.

## భక్తిశ్రద్ధలతో అమ్మ పాదపూజ ఆశీర్వచనం

### ఉప్పల చారిటేబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘనంగా మాతృ దినోత్సవ వేడుకలు.



**తలకొండపల్లి మే10(జనంసాక్షి):** తలకొండపల్లిలో అమ్మ పాదపూజ ఆశీర్వచనం కార్యక్రమాన్ని ఆదివారం శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఘనంగా నిర్వహించారు. ఉప్పల చారిటేబుల్ ట్రస్ట్,వందేమాతరం ఫౌండేషన్,శ్రుతిలయ కల్చరల్ అకాడమీల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి సంగీత,నృత్య శిక్షణ శిబిరంలో భాగంగా మాతృ దినోత్సవాన్ని పురస్కరించుకొని తల్లిదండ్రులకు పాదపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు.రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్,మై విలేజ్ మోడల్ విలేజ్ ట్రస్ట్ చైర్మన్ నితిన్ గౌడ్,శ్రుతిలయ కల్చరల్ అకాడమీ చైర్మన్ దార్ల చిత్తరంజన్,ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్, ఆమనగల్ మున్సిపాలిటీ కౌన్సిలర్ పాపిశెట్టి రాము,ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి తల్లిదండ్రులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు.విద్యార్థులు వారి తల్లిదండ్రులకు పాదపూజ చేశారు.అనంతరం మాతృమూర్తులకు ఉప్పల ట్రస్టు సౌజన్యంతో చీరలను బహుకరించారు.చిత్తరంజన్ దాస్ బృందం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.ఈ సందర్భంగా ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ మాట్లాడుతూ..ప్రతీ మనిషికి తల్లిదండ్రులే ప్రత్యక్ష దైవాలని,కన్నవారి కోసం వారు చేసే త్యాగాలు వెలకట్టలేనివన్నారు.తల్లిదండ్రుల ప్రేమకు వేరెవరూ సాటిరారన్నారు.వేసవి శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్న చిత్తరంజన్‌దాస్,ను అభినందించారు.కార్యక్రమంలో హెచ్‌ఎం శంకర్,మై విలేజ్ మోడల్ విలేజ్ ట్రస్ట్ చైర్మన్ నితిన్ గౌడ్,మాజీ జెడ్పీటిసి పద్మ నరసింహ,తలకొండపల్లి మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు కటికల శేఖర్ యాదవ్,మాజీ సర్పంచ్ గోపాల్ నాయక్,ఉప సర్పంచ్ ఈశ్వర్,నాయకులు శ్రీశైలం యాదవ్, అశోక్ గౌడ్, బుచ్చిబాబు, కోర్ర కృష్ణ నాయక్,వార్డు సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, భక్తులు, తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

### కులం పేరిట దోపిడీని ప్రశ్నించే సాహిత్యమే

# సామాజిక మార్పుకు ఆయుధం





**విశ్రాంత డీజీపీ డా. జె. పూర్ణచంద్రరావు**

**ముషీరాబాద్, మే 10 (జనం సాక్షి):** కులం పేరిట జరుగుతున్న దోపిడీ, వివక్షలను ప్రశ్నించే సాహిత్యమే సమాజ మార్పుకు నిజమైన ఆయుధమని విశ్రాంత డీజీపీ డా. జె. పూర్ణచంద్రరావు అన్నారు. చిక్కడపల్లిలోని త్యాగరాయ గానసభ లో బీసీ కవితాభేరి ఆధ్వర్యంలో నిర్వహించిన కవుల సమావేశంలో ఆయన పాల్గొని బీసీ సాహిత్యం –సామాజిక చైతన్యం పై ప్రసంగించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులు రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య, విశ్రాంత ఐఏఎస్ అధికారి టి. చిరంజీవులు, సంగెం సూర్యారావు, చెన్నా రామారావు, విశ్రాంత డీఈవో విజయ్‌కుమార్, బడే సాబ్ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డా. జె. పూర్ణచంద్రరావు మాట్లాడుతూ..తెలుగు సాహిత్యం క్రమంగా ప్రజల జీవన వాస్తవాలకు దూరమైందని, బీసీ జనుల జీవితం ప్రధాన సాహిత్య ప్రవాహంలో సరైన స్థానం పొందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తెలుగు భాషపై సంస్కృత ప్రభావం పెరగడంతో పల్లె పదాలు, జానపద భాష కనుమరుగవుతున్నాయని అన్నారు. "తెలుగు మహాభారతం పేరుతో వచ్చిన రచనల్లో కూడా తెలుగు కంటే సంస్కృత పదాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. ప్రజల భాషను పండిత భాష మింగేసింది" అని వ్యాఖ్యానించారు. భక్తి సాహిత్యం, భావకవిత్వం, తరువాతి సినిమా సంస్కృతి ప్రజలను పల్లె వాస్తవాల నుంచి దూరం చేశాయని పేర్కొన్నారు. ఒకప్పుడు పల్లెల్లో వినిపించిన పని పాటలు, జానపద గేయాలు నశించిపోయాయని అన్నారు. కమ్యూనిస్టు ఉద్యమం తెలుగు సాహిత్యానికి కొత్త శక్తినిచ్చినా, సమాజాన్ని పట్టిపీడిస్తున్న కుల వివక్ష, కులదోపిడీ అంశాలు ప్రధాన సాహిత్య ప్రవాహంలో బలంగా ప్రతిబింబించలేదన్నారు.

ప్రజల భాషలో మాట్లాడిన గద్దర్ వంటి కళాకారులు ప్రజల హృదయాలకు చేరువయ్యారని కొనియాడారు. "శ్రీశ్రీ విప్లవ కవిత్వాన్ని తెచ్చాడు. గద్దర్ ప్రజల భాషను ఉద్యమంగా మలిచాడు. కానీ కులదోపిడీపై గద్దర్ స్థాయి ప్రజా శక్తితో మాట్లాడే గొప్ప స్వరం ఇంకా రావాలి" అని అన్నారు. బహుజన సాహిత్యం అంటే కేవలం బీసీల గురించి రాయడం కాదని, అణగారిన వర్గాల ఆత్మగౌరవం, కూలీల జీవితం, పల్లె సంస్కృతి, సామాజిక వివక్షలను సాహిత్య కేంద్రంగా మలచడమేనని స్పష్టం చేశారు. "జనం మాట... జనం పాట... జనం బాధ... ఇవే సాహిత్యానికి కేంద్రం కావాలి" అని పిలుపునిచ్చారు. కులవ్యవస్థను సమర్థించే సనాతన ధర్మం పేరిట వచ్చే సాహిత్యం వెనుకబడిన వర్గాలకు అన్యాయం చేస్తోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పలువురు కవులు, రచయితలు, సాహితీవేత్తలు, తదితరులు పాల్గొన్నారు.